క్లుప్తంగా

అవసరమైన పనులు గుర్తించాలి



ఎంపీడీఓకి వినతిపత్రం అందజేస్తున్న బడుగు వెంకటేశ్వర్లు

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ గ్రామ సభలో ఉపాధి కూలీలకు ప్రజాభిప్రాయాల ప్రాధాన్యం పనులు ఎంపిక చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు బుధవారం ఎంపీడీఓకి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి గ్రామ సభల్లో స్థానిక ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చి ప్రజలకు అమోదయ్యోమైన పనులు కల్పించాలన్నారు. గ్రామాభివృ ద్ధికి ఉపయోగమైన పనులు గుర్తించాలన్నారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘ మండల నాయకులు రాములు, రోశయ్య, నాగయ్య రమేష్ తదితరులున్నారు.

తపాలా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: తపాలా శాఖ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్‌అన్నారు. స్థానిక పోస్టాఫీసులో బుధవారం డాక్ చౌపాల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పోస్టాఫీస్‌లో ఉన్న సేవింగ్స్ పథకాలు, బీమా పథకాలు, డిజిటల్ ఖాతాలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పోస్టల్ అధికారులు రమణమూర్తి, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు విరాళం



హెచ్‌ఎంకు నగదు అందజేస్తున్న దాతలు

పీసీపల్లి: మండలంలోని నేరేడుపల్లి ఉన్నత పాఠశాలలో మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్ మరమ్మతులకు పూర్వ విద్యార్థులు వెన్నపూస మాల్యాద్రి, ముప్పూరి శ్రీనివాసులు రూ.6 వేలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం టి.అంజనాదేవి మాట్లాడుతూ దాతల సహకారం అభినందనీయమని కొనియాడారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఎంఈఓకు అర్జీ అందిస్తున్న నాయకులు

లింగసముద్రం: మండలంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించాలని ఎంఈఓ-2 శివకుమార్, బీటీఏ, ఎస్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు స్థానిక ఎమ్మార్సీలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల డిప్యూటేషన్, సెలవులు, వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో అనిన్ యూనియన్లను పిలిచి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కల్లగుంట మోహనరావు, మండల అధ్యక్ష, కార్యదర్శులు మాధవరావు, వెంకట్రావు, ఎస్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి చాట్ల ప్రదీప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మహేంద్ర



సింగరాయకొండ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా బి.మహేంద్ర బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పుల్లలచెరువు మండలంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా సింగరాయకొండలో నియమితులయ్యారు. మండలంలో శాంతిభద్రల పరిరక్షణపై దృష్టి సారిస్తానని ఎస్సై పేర్కొన్నారు.

40 మద్యం సీసాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్సై

పొన్నలూరు: మండలంలోని చెరుకూరు గ్రామంలో జి.శ్రీనివాసులు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్సై జి.గిరిబాబు తెలిపారు. నిందితుడి నుంచి 40 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని, అరెస్ట్ చేసిన వ్యక్తిని కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై చెప్పారు.

తగాదా పెట్టి తమాషా చూస్తున్నారా?



టంగుటూరులో డిప్యూటీ తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న యువత



సింగరాయకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న మాలలు

- రాజకీయాల కోసం దళితులను విడదీయడం అన్యాయం
- రిజర్వేషన్‌ను ఎత్తేసేందుకే క్రీమీలేయర్ విధానం
- ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దళిత సంఘాల బంద్

టంగుటూరు: అన్నదమ్ముల్లా కలిసి ఉంటున్న దళితుల మధ్య తగాదా పెట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమాషా చూస్తున్నాయని దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ రిజర్వేషన్ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో టంగుటూరులో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం శాంతియుత వాతావరణంలో దుకాణాలు, సినిమా హాళ్లు, బ్యాంకులు, వాణిజ్య సముయాలను మూయించి బంద్ పాటించారు. బొమ్మల సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. చట్టబద్ధంగాని వర్గీకరణను రాష్ట్రాలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు చెప్పడం సరికాదన్నారు. రిజర్వేషన్లు ఏర్పరిచింది అస్పృశ్యత ఆధారంగా వారి జీవన ప్రమాణాలు పెంచడానికేనన్న విషయం మరువకూడదన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దళితులను విడదీసి పైశాచిక ఆనందం పొందుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వర్గీకరణపై సుప్రీం ఇచ్చిన తీర్పును పునఃపరిశీలన చేయాలన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దళితుల మధ్య తగాదా పెట్టి తమాషా చూస్తే అంబేడ్కర్ వారసులు చూస్తూ ఊరుకోరని, పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎస్సీ ఎస్టీలకు క్రీమిలేయర్ ప్రవేశపెట్టడం సిగ్గుచేటన్నారు. దళితులను విద్య, ఉద్యోగాలకు దూరం చేసి భవిష్యత్తులో రిజర్వేషన్ ఎత్తేసే కుట్రలో భాగంగానే క్రీమీలేయర్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. ధర్నాలో తుల్లిబిల్లి అశోక్ బాబు, బొడ్డు రవీంద్ర, బొడ్డు సతీష్, కసుకుర్తి పున్నారావు, గడతోటి బ్రహ్మయ్య, పంతగాని శ్రీను, సుదర్శన్, బాలకృష్ణ, పత్రే శ్రీను, కందిపాటి కృష్ణ, గౌతమ్, మిర్యాల ప్రదీప్, మిర్యాల కుమార్, బొడ్డు శ్రీను, వేణు, నాగరాజు, దేవ, బుచ్చిరాజుపాలెం, కాకుటూరుపాలెం, జయవరం, జరుగుమల్లి, వాలేటిపాడు, నాయుడుపాలెం, బాపూజీ కాలనీ, కారుమంచి, టంగుటూరు చుట్టుపక్కల గ్రామాల మాల యువత పాల్గొన్నారు.

సింగరాయకొండ: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం మాలలు చేపట్టిన బంద్ విజయవంతమైంది. మొదట పోలీస్‌స్టేషన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు మూసివేయించారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, సుదర్శి వెంకట్రావు, చొప్పర శివ, దామవరపు రాంబాబు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్

ఉలవపాడు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ మండల పరిధిలో బుధవారం బంద్ పాటించారు. మండల పరిధిలోని చాకిచర్ల అంబేడ్కర్ యువజన సంఘం, ఉలవపాడులోని అంబేడ్కర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో పాఠశాలలను మూసి వేయించారు. రాజ్యాంగానికి విరుద్ధంగా తీర్పు ఇవ్వడం కరెక్టు కాదన్నారు. ఆర్టికల్ 341ను సవరించకుండా వర్గీకరణ ఎలా చేస్తారని, దీనిపై పోరాటం చేస్తామన్నారు. చంద్రబాబు, మోడీ కుట్రలో భాగంగానే వర్గీకరణ తీర్పు వచ్చిందన్నారు. పాఠశాలలకు బంద్‌కు సంబంధించిన లెటర్లు అందించారు. మండల పరిధిలోని 12 గ్రామాల్లో బంద్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ అసోసియేషన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్గీకరించబడదాం.. కలిసుందాం

టంగుటూరు: 'వర్గీకరించబడుదాం.. అన్నదమ్ముల్లా కలిసి ఉందాం' అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ బక్కా తిరుమలరావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించే అధికారం రాష్ట్రాలకు కల్పిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అపహాస్యం చేసేందుకు మాల మహానాడు సోదరులు నిరసనకు దిగడం సరికాదని అభిప్రాయపడ్డారు. తాము అడగరాని కోరికలు అడగలేదని, వర్గీకరణ అయినప్పటికీ అన్నదమ్ముళ్లలా కలిసుందామని పిలుపునిచ్చారు. ప్రకటన ఇచ్చిన వారిలో ఎమ్మార్పీఎస్ వర్కింగ్ కమిటీ మెంబర్ సీకా బాలరాజు ఉన్నారు.



చాకిచర్ల ఉన్నత పాఠశాల వద్ద బంద్ పాటిస్తున్న దళితులు

శుభకార్యాలకు హాజరైన దద్దాల

వెలిగండ్ల: మండలంలోని మొగళ్లూరుపల్లిలో రాయ రామచంద్రయ్య, గురవమ్మల కుమార్తె అంజలి వివాహ వేడుకల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్ బుధవారం హాజరయ్యారు. పెళ్లి కుమార్తె అంజలిని ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాయబాలయ్య, తోక రాంబాబు, రాయ రామకృష్ణ, తెగడ రమణయ్య, బొల్లా నాగరాజు, రాయ చిన్న గురవయ్య, రాయ పెద్ద గుంటయ్య, కటికల వెంకటరత్నం, గొబ్బెళ్ల శ్రీను, రాజశేఖర్, బ్రహ్మయ్య యాదవ్ పాల్గొన్నారు.

పీసీపల్లి: మండల పరిధిలోని పిల్లివారిపల్లి సర్పంచ్ పాలగిరి బాలిరెడ్డి- ఆదిలక్ష్మీల నూతన ఇంటి గృహ ప్రవేశం బుధవారం ఘనంగా జరిగింది. గృహ ప్రవేశానికి దద్దాల నారాయణ నారాయణ యాదవ్ పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన పూజల్లో పాల్గొని స్వామి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.



మొగల్లూరుపల్లిలో పెళ్లికుమార్తెను దీవిస్తున్న దద్దాల నారాయణయాదవ్

పొగాకు సరాసరి ధర కేజీ రూ.312

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో బుధవారం సరాసరి ధర కేజీ రూ.312.86 పలికింది. పొందూరు క్లస్టర్ రైతులు 898 బేళ్లను వేలానికి తీసుకురాగా 820 కొనుగోలయ్యాయి. వ్యాపారులు 78 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.205 పలికింది. వేలంలో మొత్తం 46 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కొండపిలో 929 బేళ్ల కొనుగోలు

కొండపి(సింగరాయకొండ): కొండపి వేలం కేంద్రంలో బుధవారం 929 పొగాకు బేళ్ల కొనుగోలైనట్లు నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. కట్టవారిపాలెం, నరసింగోలు గ్రామాల రైతులు 1110 బేళ్లను వేలానికి ఉంచగా వ్యాపారులు వివిధ కారణాలతో 181 బేళ్లను తిరస్కరించారు. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.358, కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.296.74 పలికింది. వేలంలో 15 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవీసీ చేయించుకోవాలి

సింగరాయకొండ/ఉలవపాడు: స్థానిక కోఆపరేటివ్ బ్యాంకు పరిధిలోని 4 సహకార పరపతి సంఘాల్లో సభ్యులుగా ఉన్న రైతులు తమ వివరాలను కేవైసీ చేయించుకోవాలని సొసైటీ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకు పరిధిలోని కనుమళ్ల సహకార సొసైటీ, జరుగుమల్లి మండలంలోని నందనవనం సొసైటీ, ఉలవపాడు మండలంలోని ఉలవపాడు సహకార సొసైటీ, చాగొల్లు సహకార సొసైటీ పరిధిలోని రైతులు కేవైసీ చేయించుకోవాలని సూచించారు. బ్యాంకు రికార్డులు డిజిటలైజేషన్ కార్యక్రమంలో భాగంగా రైతులు తమ పేర్లు, పొలం పాసుపుస్తకాలు, రెండు ఫొటోలు, ఫోన్ నంబరు, నామినీ వివరాలను ఆయా సొసైటీ కార్యాలయంలో 10 రోజుల్లో తప్పనిసరిగా అందజేయాలని, లేదంటే సభ్యత్వం రద్దవుతుందని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కనిగిరి రూరల్: విద్యుత్ లైన్ మరమ్మతులు, టవర్ వర్క్‌లతో గురువారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. కందుకూరు మెయిన్ రోడ్డులో టవర్ వర్కుల కారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు ఎంఈఓ కార్యాలయ వెనుక వీధి ఏరియాలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కూలీలను ఆర్థికంగా బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఏపీడీ బసవ సుబ్బారావు

మర్రిపూడి: ఉపాధి హామీ పథకం కూలీలకు పనులు కల్పించి వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్(కెపాసిటీ బిల్డింగ్) బసవ సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో బుధవారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ నెల 23 నుంచి గ్రామ సభలు నిర్వహించాలని చెప్పారు. అస్టిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పక్కా గృహాల లబ్ధిదారులకు ఉపాది హామీ పథకం ద్వారా బకాయిలు చెల్లించాలని ఆదేశించారు. గ్రామసభలు నిర్వహించిన అనంతరం ఎలాంటి పనులు కావాలో అర్జీలు స్వీకరించాలని సూచించారు. సమావేశంలో ఏపీఓ గడ్డం రాంబాబు, ఏఈలు జాలయ్య, వెంకటేశ్వర్లు టెక్నికల్ అసిసెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో ఈనెల 23న ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీఓ జలజాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌కార్డు దారులందరు గ్రామ సభల్లో పాల్గొని పనులు నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి 33వ వార్షికోత్సవ ప్రత్యేక కూడికలు

కొండపి(సింగరాయకొండ): కొండపిలోని షాలేం ప్రార్థన మందిరం 33వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం నుంచి ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం వరకు ప్రత్యేక కూడికలు నిర్వహిస్తున్నట్లు దైవ సేవకుడు మైఖేల్ ఓ ప్రకటనలో తెలిపారు. ఒంగోలు ఎష్కోలు ప్రార్థన మందిరం దైవ సేవకుడు వై. జాన్ సుబ్బారెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బ్రదర్ జయంత్‌రావు దైవ సందేశం అందిస్తారని పేర్కొన్నారు. క్రైస్తవులు పాల్గొని ప్రత్యేక కూడికలను విజయవంతం చేయాలని కోరారు.

కేరళ వరద బాధితులకు విరాళం



విరాళం అందజేస్తున్న సేవా సదన్

కందుకూరు రూరల్: కేరళ వరద బాధితులకు సేవా సదన్ రాష్ట్ర సంఘం తరపున రాష్ట్ర అధ్యక్షుడు నాగిసెట్టి మాల్యాద్రి బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.మాలకొండయ్యకు రూ.6వేలు అందజేశారు. సేవా సదన్ సోషల్ మీడియా అధ్యక్షులు కట్టా యేసు నాదం, ఉపాధ్యక్షుడు సులోచన, ప్రధాన కార్యదర్శి శంకర్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుల సహకారంతో నగదు అందజేశారు. సీపీఐ కార్యవర్గసభ్యులు షేక్ హుస్సేన్, సామాజికవేత్త బి.వెంకటేశ్వర్లు, జాలయ్య, ఏఐటీయూసీ కార్యదర్శి ఆనంద్‌మురళి, లక్ష్మీనారాయణ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

26న ఆలయ భూముల కౌలువేలం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని పెదగోగులపల్లె గ్రామంలోని శ్రీమార్గ సహసేశ్వర, కోదండరామస్వామి ఆలయాలకు చెందిన 213.53 ఎకరాలకు ఈ నెల 26న కౌలువేలం నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. 2024 నుంచి 2027 వరకు మూడేళ్లకు కౌలువేలం నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 9581189313 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ట



దద్దాలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ



ధ్వజ స్తంభ పీఠం వద్ద పూజలు చేస్తున్న డాక్టర్ దద్దాల, ఎంపీపీ లక్ష్మి

పామూరు: మండలంలోని ఇనిమెర్లలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో సీతారామ లక్ష్మణ, హనుమంత దేవతామూర్తుల ప్రతిష్ట బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు శతచండి, శతరుద్ర హోమాలు నిర్వహించారు. స్వామివార్ల మూల విగ్రహమూర్తులు, పంచలోహ ఉత్సవ మూర్తులకు ధాన్యాదివాసం, పుష్పాదివాసం, శయనాదివాసం, వస్త్రాదివాసం, జలాదివాసం నిర్వహించారు. స్వామివార్ల మూల విగ్రహమూర్తులు, ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టలో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, ఎంపీపీ గంగసాని లక్ష్మి, జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య పలువురు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా ఆలయ కమిటీ స్వామి శేషవస్త్రంతో ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, వాకమళ్ల కోటిరెడ్డి, గాజులపల్లి శ్రీనివాసరెడ్డి, నారాయణరెడ్డి, లక్ష్మిరెడ్డి భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ రక్షణ

వలేటివారిపాలెం (కందుకూరు రూరల్): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ జి.ప్రసాద్ బాబు అన్నారు. నేలతల్లి కోసంమొక్కలు నాటడం కార్యక్రమంలో భాగంగా మండలంలోని శాఖవరం రైతుసేవా కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ 2025 మార్చి నాటికి దేశంలో 140 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా కేవీకే శాస్త్రవేత్తలు శాఖవరం గ్రామంలో 200 వన మొక్కలు రైతులకు, మహిళా రైతులకు, విద్యార్థులకు అందజేసి వాటిని నాటించారు. వయ్యారిభామ కలుపు మొక్క నివారణపై అవగాహన కల్పించారు. వాటిని సామూహికంగా పీకీ తగులబెట్టాలని సూచించారు. మిరపలో నూతనంగా విడుదలైన ఎల్‌సీఏ-643, 657 రకాలను క్షేత్ర పరిశీలనకు రైతులకు ఇచ్చారు. శాస్త్రవేత్తలు వెంకటేష్, నీహారిక, జ్యోతి, మయాంక్, రైతు సేవా కేంద్రం వీఏఏ గౌతమి, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శాఖవరంలో మొక్కలు నాటుతున్న శాస్త్రవేత్తలు

చెడు వ్యసనాలతో జీవితం నాశనం

కందుకూర రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ జోన్-1 సూపర్‌వైజర్లు వినయ్, లింక్ వర్కర్ ఎం.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని కొండముడుసుపాలెంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు, గ్రామస్తులకు మీకు తెలుసా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి కాలంలో యువత ఎక్కువగా వ్యసనాలకు బానిసలై చెడిపోతున్నారని చెప్పారు. చెడు వ్యసనాలకు అలవాటు అయ్యే సమయంలోనే వారిని గమనించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం తల్లిదండ్రులపై ఉందన్నారు. పిల్లలను ప్రవర్తనను ప్రతి రోజు గమనించాలన్నారు. టాటూలకు, డ్రగ్స్ వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఏఎన్‌ఎం విజయకుమారి, ఆషా వర్కర్స్‌లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్, లింక్ వర్కర్

ఉపయోగపడే పనులు గుర్తించండి

లింగసముద్రం: మండలంలోని అన్ని గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఈ నెల23న గ్రామసభలు నిర్వహించి పనులు గుర్తించాలని ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ సమావేశ, నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు పనికి వచ్చే పనులు గుర్తించి పనులు చేయాలన్నారు. సిమెంట్ రోడ్లు, సైడు కాలువలు, ఫారంపాండ్లు, బీటీ రోడ్లు తదితర పనులు గుర్తించాలన్నారు. ప్రతి గ్రామంలో పనులు గుర్తించి కుటుంబానికి 100 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ఈఓఆర్డీ రామసుబ్బారావు, ఏపీఓ సమీష్‌బాషా, ఏపీఎం సింహాద్రిరావు, ఏఓ అబ్రహాంలింకన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాగర్, టెక్నికల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

23న ఉపాధి హామీ గ్రామసభలు

హనుమంతునిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ గ్రామసభలు 23 పంచాయతీ పరిధిలోని 14 సచివాలయాలో ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.లలిత బుధవారం ఒక ప్రకటల్లో తెలిపారు. ప్రతి గ్రామసభకు ఉపాధి కూలీలు, అధికారులంతా హాజరు కావాలన్నారు. నిధులు దుర్వినియోగం అయ్యే పనులు చేపట్టరాదన్నారు. జాబ్ కార్డున్న కూలీకి వంద రోజులు పని కల్పిస్తారన్నారు. అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజర్ కావాలని కోరారు.

నాగమ్మ మృతి తీరని లోటు



నాగమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ

కనిగిరి రూరల్: పెన్నా నాగమ్మ మృతి పార్టీకి తీరని లోటు అని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. పట్టణంలోని 3వ వార్డుకు చెందిన దివంగత పెన్నా నాగమ్మ దశదిన ఖర్మ బుధవారం శంఖవరంలో జరిగింది. నాగమ్మ చిత్రపటానికి దద్దాల నారాయణ యాదవ్, పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, కౌన్సిలర్లు రామనబోయిన ప్రశాంతి శ్రీను, దేవకి రాజీవ్, కోఆప్షన్ సభ్యులు చింతం శ్రీనివాసుల యాదవ్, కొడిపిల్ల ఆంజనేయులు, గోబ్బిళ్ల శ్రీను, వాకుమళ్ల రాజశేఖర్‌రెడ్డి, కోటేశ్వరరావు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.